మేట వేసిన అవినీతి

- బుడమేరు, చంద్రయ్య డ్రెయిన్లలో ముందుకు సాగని నీరు
- ఆందోళనలో రైతులు
- ముడుపుల మత్తులో అధికారులు



చంద్రయ్య డ్రెయిన్‌లో మేటవేసిన గుర్రపుడెక్క

గుడివాడరూరల్: వేలాది ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు మురుగు నీటిని బయటకు పంపే డ్రెయిన్లు గుర్రపుడెక్క, నాచు, కిక్కిసతో మేట వేసుకుపోయాయి. ప్రతి ఏడాది ప్రభుత్వం గుర్రపుడెక్క, తూడు నిర్మూలనకు నిధులు కేటాయించినా కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడం, పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ముడుపుల మత్తులో జోగుతూ పట్టించుకోకపోవడంతో చిన్న పాటి వర్షాలకు కూడా డ్రైన్లు ఎగతన్ని నీరు సక్రమంగా ప్రవహించక పంట పొలాలను, గ్రామాలను ముంచేస్తున్నాయి. టెండర్ల ప్రక్రియ గడువు ముగుస్తున్నా ఇప్పటివరకు డ్రైన్లలో గుర్రపుడెక్క, తూడు, నాచు తొలగించిన దాఖలాలు లేవు. ప్రతి ఏడాది ఇదే మాదిరిగా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై పనులు చేయకుండానే బిల్లులు చేసేస్తుండటంతో డ్రైన్ల పరిస్థితి దారుణంగా తయారైంది.

మెయింటినెన్స్ నిధులు ఏమయ్యాయి?

గుడివాడ నియోజకవర్గంలో డ్రైన్ల అభివృద్ధికి ప్రతి ఏడాది మెయింటినెన్స్ రూపంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ప్రధానంగా బుడమేరు డ్రైన్‌కు పుట్టగుంట వంతెన నుంచి ఎల్‌ఎన్ పురం వరకు గుర్రపుడెక్క తొలగింపు పనులను గుడివాడకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్ చేజిక్కించుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులకు సగానికి సగం కోత వేస్తూ టెండర్‌ను దక్కించుకున్నారు. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు పనులు చేయాల్సి ఉన్నా ఇంతవరకు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. సెప్టెంబర్‌లో వరదలు వచ్చిన సమయంలో ఉన్నతాధికారుల ఒత్తిడితో పుట్టగుంట వంతెన వద్ద తూడు తొలగింపు పనులను మాత్రమే చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తూడు, డెక్క తొలగించాలని మొత్తుకున్నా సదరు కాంట్రాక్టర్ పత్తా లేరు. అధికారులు పట్టించుకోకపోవడంతో పుట్టగుంట వంతెన వద్ద నుంచి ఎల్‌ఎన్‌పురం వరకు గుర్రపుడెక్క మేట వేసి నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. ఫలితంగా పరిసర ప్రాంతాల్లోని గ్రామాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. మరో మేజర్ డ్రైన్ అయిన చంద్రయ్య డ్రైన్‌ది ఇదే పరిస్థితి. పెదపారుపూడి నుంచి కొల్లేరు వరకు ఎక్కడ చూసినా గుర్రపుడెక్క దర్శనమిస్తుంది. ఈ డ్రైన్ ద్వారా గుడివాడ రూరల్, నందివాడ, మండవల్లి మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు మురుగు నీరు పోవాల్సి ఉంది. డ్రైన్‌లో గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోవడంతో నీరు సక్రమంగా ప్రవహించక పంట పొలాలు ముంపునకు గురి కావడం, నీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ డ్రైన్‌కు సంబంధించి గుర్రపుడెక్క తొలగింపునకు కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటివరకు తొలగింపు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పనులు చేయకుండానే బిల్లులు మంజూరు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేయించాలని రైతులు కోరుతున్నారు.



ఎల్‌ఎన్‌పురం వద్ద బుడమేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

పనులు చేయకుండానే బిల్లులు



డ్రైన్ల పర్యవేక్షణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై, పనుల నిర్వహణను గాలికి వదిలేశారు. చంద్రయ్య డ్రైన్‌లో గుర్రపుడెక్క తీసిన దాఖలాలు ఏడాది కాలంలో లేవు. డ్రైన్లలో ఎక్కడ చూసినా గుర్రపుడెక్క, తూడే కన్పిస్తుంది. పనులు చేయకుండానే అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు చేసేస్తున్నారు. దీనివలన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– బాబ్జీ, తమిరిశ గ్రామస్తుడు

అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపం



బుడమేరు డ్రైన్‌లో పుట్టగుంట వద్ద నుంచి గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోయింది. కాంట్రాక్టర్ మెయింటినెన్స్ పేరుతో ప్రతి ఏడాది కాంట్రాక్టు తీసుకోవడమే కానీ పనులు చేయడం లేదు. పుట్టగుంట వద్ద నుంచి కొల్లేరు వరకు ఒక్క తూడు మొక్క తీసిన దాఖలాలు లేవు. అడ్డగోలుగా సగానికి సగం టెండర్లు దాఖలు చేసి పనులు చేయకుండానే బిల్లులు చేజిక్కించుకుంటున్నారు.

– సత్యనారాయణ, రైతు, ఎల్‌ఎన్‌పురం

క్లుప్తంగా

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ



గుడివాడటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.పద్మ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానవులందరికీ భగవద్గీత అనే కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాల పంపిణీ జరిగిందన్నారు. మొత్తం 800 పుస్తకాలను విద్యార్థులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ప్రెసిడెంట్ వల్లూరుపల్లి లక్ష్మి, మహిళా సంఘం సభ్యురాలు వి.జయవేణి, కావూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే



గుడివాడటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి, డాక్టర్ కృష్ణదొర ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రోగుల వ్యాధి లక్షణాలను తెలుసుకోవడంలో ల్యాబ్ టెక్నీషియన్స్ పాత్ర ఎంతో ఉంటుందన్నారు. పేదలకు చేస్తున్న వైద్య సేవలో వీరు కూడా భాగస్వాములన్నారు. అనంతరం సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌లు షేక్ ఫరీద్ బాషా, ఎంఎస్ కోటేశ్వరరావు, లక్ష్మణ్, ల్యాబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ జయశ్రీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా బాలమ్మ కల్యాణ వేడుకలు



కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పయిన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి 262వ వార్షిక కల్యాణ వేడుకలు గురువారం వేకువజామున కనుల పండువగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుని మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రయుక్తంగా, అంగరంగ వైభవంగా కల్యాణ వేడుక జరిగింది. కల్యాణాన్ని శాశ్వత ఉభయదాతలు సోమయాజులు మురళీకృష్ణ కనకదుర్గ దంపతుల చేతుల మీదగా పెనుమూడి సతీష్ కుమార్, పెనుమూడి పూర్ణచంద్ర శేఖర శర్మ, ఉదయేశ్వర్, సుబ్రమణ్య శాస్త్రి నిర్వహించారు. అనంతరం దేవాలయ పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గురువారం మహా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 16వ శతాబ్దంలో కవయిత్రి మొల్లమాంబ రచించిన రామాయణం, ఇతర గ్రంథాలు ఆధ్యాత్మిక గ్రంథాలకు మణి మకుటాలుగా భాసిల్లాయన్నారు. అనంతరం ప్రముఖ ఉపాధ్యాయిని చక్కా శకుంతలను మొల్ల సాహితీ పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు భాషా వికాస పరిషత్ కన్వీనర్ డీఆర్‌బీ ప్రసాద్, గ్రంథాలయ అధికారి బీరం వెంకట రమణ, సాహితీవేత్తలు మోహన్ బాబు, సీహెచ్ రూప, కె.సురేష్, తాతా పద్మలత, సీహెచ్ లక్ష్మీసురేఖ, ఎ.శ్రీనివాసరావు, అవిర్నేని వెంకటేశ్వరరావు, ఎస్.ప్రసాదు, ఎం.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తతతో మెలగాలి

గుడ్లవల్లేరు: సమాజంలో విద్యార్థినులు, మహిళలు, యువతులు, బాలికలు అప్రమత్తతతో మెలగాలని గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసు సూచించారు. గుడ్లవల్లేరులోని బీసీ సంక్షేమ బాలికల కాలేజీ వసతి గృహంలోని పాలిటెక్నిక్ విద్యార్థినులకు గురువారం ఆయన మహిళా రక్షణకు రూపొందించి అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టాలతో పాటు సామాజిక మాధ్యమాల వినియోగం, వాటి దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, వాటిపై తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై వివరించారు. సమావేశంలో తహసీల్దార్ బి.లోకరాజు, ఎస్ఐ ఎన్.వి.వి. సత్యనారాయణ, ఏసీడీపీఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు డీఎన్నార్ పరామర్శ

కైకలూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కలిదిండి మండలం మూలలంకలో పలువురిని గురువారం పరామర్శించారు. పార్టీ నాయకురాలు బాల లక్ష్మమ్మ కుమార్తె నాగమణి ఇటీవల మృతి చెందగా నాగమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామానికి చెందిన కడలి నాగరాజు మృతి చెందగా అతని సోదరుడు శ్రీనివాసరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు కె.గణపతి కుమారుడు మృతి చెందగా మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎన్నార్ వెంట సర్పంచ్ విజయబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అన్నవరం, ఎంపీటీసీ సభ్యుడు ఆర్.బాలు, జోజికుమార్, కె.నాగరాజు, కె.రాంబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

గుడివాడటౌన్: స్థానిక విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాల 57వ వార్షికోత్సవం గురువారం సాయంత్రం జరిగింది. విశ్వభారతి విద్యాసంస్థల అధిపతి పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్ మంజుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. వార్షికోత్సవంలో భాగంగా ప్రపంచమంతా వసుధైక కుటుంబం అన్న భావంతో చిన్నారులు చైనా సంప్రదాయ నృత్యాలు, రష్యా బ్యాలే నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన చెస్ ఛాంపియన్ షిప్‌లో గెలిచిన ఎ.శ్రీరంగనాథ్, డి.మహిమారాతుల్, డి. సోఫీఆరాధ్యలకు చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గుడ్లవల్లేరులో ఉచిత పాలీసెట్ శిక్షణ

గుడ్లవల్లేరు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తి చేసుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులకు గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో ఉచితంగా పాలీసెట్‌కు శిక్షణ ఇవ్వనున్నారు. ఏటా ఈసెట్ పరీక్షలో టాప్ టెన్ ర్యాంకుల్లో అత్యధిక ర్యాంకులు సాధిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ ప్రైవేట్ పాలిటెక్నిక్‌గా గుర్తింపు పొందిన ఈ కాలేజీలో ఉచిత పాలీసెట్ శిక్షణ తరగతులు వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పాలీసెట్ వచ్చే నెల 30న జరుగుతుంది. ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి తరగతులు నిర్వహిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ తెలిపారు. ఉచిత శిక్షణకు హాజరు కాగోరు విద్యార్థులు వచ్చే నెల 3వ తేదీ లోగా కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఇ హాల్ టికెట్ జిరాక్స్, కాలేజీకి వచ్చి అభ్యర్థి పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ కౌన్సెలింగ్, అడ్మిషన్‌కు సంబంధించిన సమాచారాన్ని 79975 08931 నంబర్‌కు వాట్సాప్ గ్రూప్‌లో జాయిన్ అవడం ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని చెప్పారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో శనివారం ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గురువారం క్లబ్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కంటి పరీక్షలతో పాటు ఉచిత మందులను పంపిణీ చేయనున్నామని చెప్పారు. శుక్లాలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేయిస్తామని, ఈ అవకాశాన్ని దృష్టి దోషాలు ఉన్నవారు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

టెన్త్ పరీక్షలకు 505 మంది విద్యార్థులు

గుడ్లవల్లేరు: మండలంలో ఈ నెల 17వ తేదీ నుంచి జరగబోయే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు 505 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఎంఈఓ – 1 జగన్‌మోహన్‌రావు, ఎంఈఓ – 2 గోపాలరావు గురువారం తెలిపారు. డోకిపర్రు, కౌతవరం, గుడ్లవల్లేరు, అంగలూరులోని నాలుగు పరీక్ష కేంద్రాలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఈ కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లను చేశామన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రిద్దాం

గుడివాడటౌన్: పట్టణంలోని ప్రతి ఒక్కరూ సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛాంధ్ర యాక్టివిటీస్ థీమ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీన పట్టణంలోని ప్రతి ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించే కార్యక్రమం చేపట్టామన్నారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ వినియోగించిన సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అనగా ప్లాస్టిక్ బాటిల్స్, కప్పులు, గ్లాసులు స్వచ్ఛందంగా పురపాలక సంఘ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పట్టణంలోని ప్రజలు, వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థల వారు ఈ కార్యక్రమంలో పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

తోట్లవల్లూరు: స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ కేఎస్ రవికాంత్ తెలియజేశారు. 2024–25 సంవత్సరానికి గానూ బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లకు సంబంధించి లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలకు సబ్సిడీ మంజూరు చేయటానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతోపాటు 21 నుంచి 60 సంవత్సరాల మధ్యలో వయసు ఉండాలని చెప్పారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల వారికి 21 నుంచి 50 ఏళ్ల మధ్యలో వయసు ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 10 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రవికాంత్ సూచించారు.

బాబా ఆలయంలో అన్నసమారాధన

మండవల్లి: మండవల్లి పీహెచ్‌సీ వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో మండవల్లి, కొర్లపాడు, పెరికెగూడెం, గన్నవరం, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బందారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ కె.పంకజ్‌కుమార్, ఏఎంవో ఆర్.రామారావు గురువారం పరిశీలించారు. పీఎం శ్రీ నిధులతో సైన్స్ ల్యాబ్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను హెచ్ఎం వై.విజయకుమార్ నుంచి అధికారులు తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ముగిసిన పోషణా బీ పడాయి బీపై శిక్షణ

గుడ్లవల్లేరు: పోషణా బీ పడాయి బీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అంగలూరులో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా గుడివాడ ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.విజయ ఫ్లోరెన్స్ సమావేశంలో మాట్లాడుతూ పిల్లల్లో మానసిక, శారీరక, భాషా, సాంస్కృతిక, కళాభివృద్ధి పెంపొందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని చెప్పారు. ఏసీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ ఇ.వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగ నాంచారమ్మకు పూజలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరులో ఉన్న నాగనాంచారమ్మ సంబరాలు గురువారం వైభవంగా నిర్వహించారు. హోలీ పౌర్ణమి సందర్భంగా ఏటా అమ్మవారి సంబరాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు. సంబరాల అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

పామర్రు: స్థానిక వీరాంజనేయపురం కాలనీలోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం నాయకుడు ఒడుగు గంగాధర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కాలనీలో గురువారం ఆయన పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో సమస్యలపై పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముళ్లపూడి విల్సన్, కాటూరి నాగభూషణం, ఇంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కైలే



పామర్రు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గురువారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత జిల్లా నాయకులతో సమావేశం పూర్తయిన తర్వాత అనిల్‌కుమార్ మాజీ సీఎంను కలిసి పామర్రు నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. భవిష్యత్‌లో పార్టీ అభ్యున్నతికి తీసుకోవాల్సిన కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు.

ఘనంగా నాగేశ్వరస్వామి కల్యాణం



కల్యాణమూర్తులుగా బాలా త్రిపురసుందరీ సమేత నాగేశ్వరస్వామి వారు

నెమ్మలూరు(పామర్రు): గ్రామంలో ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం గురువారం తెల్లవారు జామున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్రయాహ్నిక దీక్షతో మహోత్సవాలను ఘనంగా నిర్వహించామని అన్నారు. స్వామివారిని పెండ్లి కుమారునిగా చేసి, అమ్మవారికి సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. దీక్షారంభం, త్రిశూల మండపారాధన, వాస్తు మండపారాధన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ చేశారు. గురువారం తెల్లవారు జామున ఉదయం 2 గంటలకు ఎదురుకోల సన్నాహం, అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం జరిగిందని చెప్పారు. కపిలేశ్వరపురానికి చెందిన యాజ్ఞికులు లంక హనుమంత శర్మ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలను నిర్వహించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంబా చిదంబర శాస్త్రి, ఆలయ సిబ్బంది కూసం ప్రభాకరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు మహోత్సవం



విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం

పామర్రు: స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్‌లో గురువారం ఫేర్ వెల్ పార్టీ అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు ఫేర్ వెల్ పార్టీ(వీడ్కోలు మహోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎంఈవో–2 పద్మవాణి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో తేలికపాటి ఆహారాన్ని తీసుకోవాలని, విశ్రాంతి ఎక్కువగా తీసుకోవాలని అన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులు వారికి విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తదుపరి 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు బహుమతులను అందజేసి పబ్లిక్ పరీక్షలలో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఏఎస్ఎం ప్రిన్సిపాల్ ఎ.పూర్ణచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



కోమల బాబు శిష్య బృందం ప్రదర్శిస్తున్న నృత్యం

కూచిపూడి(మొవ్వ): శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సిద్ధేంద్ర యోగి కళా వేదికపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరిస్తున్నాయి. మూడో రోజైన గురువారం నాట్యాచార్య మాదు కోమల బాబు శిష్యులు ప్రదర్శించిన అంశాలు పూర్వ సంప్రదాయంలో కొనసాగి అలరించాయి. కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయ (హైదరాబాద్) విద్యార్థులైన గుండారపు కౌశిక, మంతెన శృతి ప్రియాంక, ఎలకంటి చైత్ర, గుడిపాటి దిషిత, తాళ్ళ యాక్షిక, సుధతోపాటు కోమల బాబు కలిసి ప్రదర్శించిన వినాయక స్తుతి తాండవ నత్యకరి గణపతి ప్రార్థనతో ప్రారంభించి, రామశబ్దం, జతి కట్టు, రామాయణ శబ్దం, బ్రహ్మాంజలి అంశాలకు చక్కని హావభావాలతో, అందెల సవ్వడులతో ఆశీనులలో భక్తి భావాన్ని ప్రజ్వలింప చేశారు. ఈ అంశాలకు నాట్య గురువు పసుమర్తి రత్తయ శర్మ నట్టువాంగం నిర్వహించగా, ముట్నూరి పావని గాత్రం, పసుమర్తి హరినాథ శాస్త్రి మృదంగంపై, పాణ్యం దక్షిణామూర్తి వయొలిన్‌పై సహకరించారు. కళాకారులను నిర్వాహకులైన డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, పాలకమండలి సభ్యులు శాలువాలతో, జ్ఞాపికలతో సత్కరించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం పరిశీలన



భుజబలపట్నంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కైకలూరు: మండలంలోని భుజబలపట్నం హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సమగ్ర శిక్ష అధికారులు గురువారం పరిశీలించారు. అడిషనల్ ప్రాజెక్టు అధికారి కె.పంకజ్‌కుమార్, ఏఎంఓ రెడ్డి రామారావు కేంద్రంలో వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి నుంచి వివరాలు సేకరించి పరీక్ష రాసే విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

రీసర్వే వివరాలు సక్రమంగా ఉండాలి



వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ అంబరీష్

కైకలూరు: రీ–సర్వే వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సక్రమంగా చేయాలని ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ అన్నారు. మండలంలోని సోమేశ్వరంలో రీ–సర్వేకు సంబంధించిన వివరాలను ఆయన పరిశీలించి సర్వేయర్లతో మాట్లాడారు. భూముల వివరాల నమోదులో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, నిర్దేశించిన కాలపరిమితిలోపు సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ ఇబ్రహీం, సర్వేయర్లు ఉన్నారు.

ఘనంగా వెంకన్న సన్నిధిలో నవమ పుష్పయాగం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో గురువారం నవమ పుష్పయాగ మహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్న ఈ యాగాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రేపు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన సదస్సు

గుడ్లవల్లేరు: ఈ నెల 15వ తేదీన ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు గుడ్లవల్లేరు గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు తెలిపారు. ఈ విషయమై గురువారం ప్రతి దుకాణదారునకు సమాచారం తెలియజేసినట్టు చెప్పారు.